క్లుప్తంగా

డ్రగ్స్ రహిత సమాజం కావాలి

తాళ్లరేవు: సమాజాన్ని డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యనళిని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషా ముక్త్ భారత్ అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సుంకరపాలెం శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలలో సీడీపీఓ వి.మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్యనళిని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో అమ్మకాలను పెంచాలి



ఉప్పలగుప్తంలో మహిళామార్ట్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ జిలాని

ఉప్పలగుప్తం: మహిళా మార్ట్‌లో అమ్మకాలు పెంచే విధంగా సిబ్బంది పనిచేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ ఎం.ఎం.జిలాని అన్నారు. మండలంలో ఉప్పలగుప్తంలో ఉన్న మహిళా చేయూత మార్ట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్ట్‌లో విక్రయించే సరుకులపై నాణ్యత, ధరలు ప్రజలకు అవగాహన కల్పించి అమ్మకాలు మరింత పెంచేలా సిబ్బందికి ఆదేశిస్తున్నామన్నారు. గతంలో మార్ట్‌లో జరిగిన అవకతకలను గుర్తించి రికవరీ చేశామని ఆయన వివరించారు. జిల్లా యాంకర్ పర్సన్ శాయ్యేల్, ఏపీవోలు అయితాబత్తుల సురేంద్ర, భూపతి వర్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణ

అమలాపురం రూరల్: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ లోక కల్యాణం కోసం అమలాపురంలో మహిపాల వీధిలో వేంచేసిన లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా పలువురు భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణ నిర్వహించారు. రామానంద స్వామి శిష్యుడు సుబ్బారావు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈపారాయణ నిర్వహించారు. అర్చకుడు ఈమని సాయికృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధి చిక్కం కృష పాల్గొన్నారు.

మెరిట్ ప్రాతిపదికన టీచర్ పోస్టుల భర్తీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా 145 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ పోస్టులను మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు మంగళవారం డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలిపింది. 340 గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులను సైతం భర్తీ చేస్తామన్నారు. వివిధ కళాశాలల్లో 67 అధ్యాపక పోస్టులకు రెగ్యులర్ ప్రాతిపదికన నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందని వారిని త్వరలో నియమిస్తామన్నారు. హెచ్ఎమ్ గ్రేడ్-2కు సంబంధించి 34 పోస్టులు గ్రాడ్యుయేట్ టీచర్‌లకు పదోన్నతి ద్వారా భర్తీ చేస్తామన్నారు. దీనికి అదనంగా మరో 14 పోస్టులను భర్తీ చేస్తామని, 31 లెక్చరర్ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేస్తామన్నారు.

మున్సిపల్ సిబ్బంది నిరసన



కొవ్వొత్తులతో నిరసన కొనసాగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

యానాం: యానాం మున్సిపాలిటీ ఉద్యోగులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కొద్ది రోజులుగా వివిధ రూపాల్లో చేస్తున్న నిరసనను మంగళవారం ముమ్మరం చేశారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్ఏఓ ఆఫీసు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్దినెలలుగా తమకు బకాయి పడ్డ జీతాలు చెల్లించడం లేదని అన్నారు. అనంతరం స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద నిరసన దీక్ష శిబిరం నుంచి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి నిరసనను కొనసాగించారు. ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పి కృష్ణ, వైస్‌ప్రెసిడెంట్ కర్రి రాంబాబు, ట్రెజరర్ కర్రి రాంబాబు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు

యానాం: యానాంలో ఈనెల 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి పీడబ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా జాతీయపతాకాన్ని మంత్రి లక్ష్మీ నారాయణ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోలీసు దళాలు, హోమ్ గార్డులు, రిజర్వు బెటాలియన్ పోలీసులు తదితరులతో గౌరవవందనాన్ని స్వీకరించనున్నారు. అనంతరం వివిధ ప్రభుత్వశాఖల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు.

పాడి పశువులకు బీమా ఊసేలేదు!

- పశుపోషకులకు భరోసా కరవు
- పశు బీమా పథకం అమలుపై కూటమి ప్రభుత్వం కాలయాపన
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 80 శాతం రాయితీపై బీమా



నడవపల్లిలో పశువులతో పాడి రైతు (ఫైల్)

కాట్రేనికోన: ప్రభుత్వం పాడి పశువుల రక్షణ కోసం జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశువుల బీమా పథకం అమలుపై ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. పశువుల బీమా పథకం పాడి రైతుల పాలిట ఆపద్బంధువుగా ఉండేదని, ప్రస్తుతం బీమా పథకం చేయించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు చెందిన పశువులు ప్రమాదవశాత్తు మరణిస్తే సన్న, చిన్నకారు రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారనే ఉద్దేశ్యంతో జగనన్న రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఐ.పోలవరంలో 11,186, ముమ్మిడివరంలో 10,700 , కాట్రేనికోనలో 12,886 పశువులు ఉన్నాయి. ముమ్మిడివరం మండలంలో 4,400 ఆవులు, 4,200 గేదేలు, 2,100 గొర్రెలు, ఐ.పోలవరంలో 4,144 ఆవులు, 4,654 గేదెలు, 867 గొర్రెలు, 1521 మేకలు, కాట్రేనికోన మండలంలో ఆవులు 5,410, గేదెలు 4,803, మేకలు 1,533, గొర్రెలు 840, ఇతర పశువులు 300 పశువులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పశు సంవర్ధక శాఖ అధికారులు పాడిరైతులు వద్దకు వెళ్లి పశుబీమా పథకంపై అవగాహన కల్పించి బీమా చేయించే వారు. చంద్రన్న ప్రభుత్వంలో పశు బీమా ఊసేలేకపోవడంతో పాడి రైతులకు భరోసా లేకుండా పోయిందని వాపోతున్నారు.

పశుబీమా పథకం వర్తింపు

ఉత్పాదక దశలో ఉన్న 2–10 ఏళ్ల వయసులోపు ఉన్న ఆవులు, 3–12 ఏళ్ల వయసు గేదెలకు రూ.30 వేలు, ఏడాదిన్నర వయస్సు ఉన్న మేలు జాతి ఎద్దులు, దున్నలకు రూ.30 వేలు, రెండేళ్లపై బడిన ఎద్దులు, దున్నలు, నాటు ఆవులకు రూ.15 వేలు, ఆరు నెల వయసు పైబడిన మేకలు, గొర్రెలు, పందులకు రూ.6 వేలు చొప్పున బీమా పథకం వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు వరదలు, తుఫానులు, పాము కాటు, అడవి జంతువుల దాడి, పిడుగు పడి, అగ్ని ప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదాలతోను, జబ్బుతో పశువులు మృత్యువాత పడితే బీమా పథకం వర్తిస్తుంది.

పశువులకు బీమా వర్తించదు

పశువు యాజమాని ఉద్దేశ్య పూర్వకంగా హాని తలపెట్టినా, ఇతర బీమా ఏజెన్సీల్లో పశుబీమా చేయించినా, రాష్ట్ర, జాతీయ విపత్తుల ప్రతిస్పందన నిధి పరిధిలోనికి వచ్చే ప్రమాదాలకు బీమా వర్తించదు. 10 ఏళ్ల వయస్సు దాటిన ఎద్దులు, దున్నలకు, ఆరు నెలలు లోపు వయసు గొర్రెలు, మేకలు, పందులకు, శాశ్వత అంగవైకల్యం కలిగిన పశువులకు బీమా వర్తించదు.

ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు 80 శాతం సబ్సిడీపై బీమా చెల్లింపు

ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు 20 శాతం లబ్ధిదారుల శేరు ధనం, ఇతరులు 50 శాతం శేరు ధనం చెల్లిస్తే మిగిలిన బీమా సొమ్మును గతంలో ప్రభుత్వం చెల్లించేది.

లబ్ధిదారులు చెల్లించాల్సిన ప్రీమియం

ఆవు, గేదెలకు బీమా రూ.15 వేలకు రూ.192 ప్రభుత్వం రాయితీ రూ.768 , రూ. 30 వేలకు రూ.384 ప్రభుత్వ రాయితీ రూ.1,536, మేకలు, గొర్రెలు, పందులకు ఏడాదికి ప్రభుత్వ రాయితీ రూ.144 చెల్లించగా రూ.36 చొప్పున ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ప్రీమియంను చెల్లించాలి. ఇతరులు ఆవులు గేదెలకు రూ.15 వేలకు రూ.480, రూ.30 వేలకు రూ.960 లబ్ధిదారుని వాటాగా చెల్లిస్తే మిగిలిన 50 శాతంను ప్రభుత్వం చెల్లించేది.

> **అనుమతులు రావాల్సి ఉంది**
>
> ప్రస్తుతం పశుబీమా పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. పశు బీమా చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావలసి ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రైతుల నుంచి బీమా ప్రీమియం సొమ్మును పాడి రైతులను కట్టించుకుంటాం.
>
> – నాగేశ్వరరావు, జిల్లా పశుసంవర్థక శాఖ సహాయకులు
>
> **గతంలో రాయితీపై బీమా**
>
> గత ప్రభుత్వం 80 శాతం రాయితీపై పశువులకు బీమా చేయించే వారు. పశువుల పోషణకు భరోసా లభించేది. ప్రమాదవశాత్తు ఇబ్బందులు ఎదురైనపుడు బీమా ఆదుకునేది. ప్రస్తుతం పశు బీమా పథకంపై ప్రభుత్వం చేతులెత్తేయడంతో భరోసా లేకుండా పోయింది.
>
> – గిడ్డి గోపాలస్వామి, పాడి రైతు

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



యానాంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



అమలాపురంలో విద్యార్థినులతో కలిసి తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

అమలాపురం టౌన్: దేశ స్వాతంత్ర్యం సిద్ధించిన రోజైన ఆగస్టు 15న ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపుతో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అమలాపురంలో మంగళవారం ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. విద్యార్థులు, బీజేపీ నాయకులతో సాగిన యాత్రను స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయకుమారి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు జాతీయ జెండాలను చేతపట్టి పుర వీధల్లో కాలి నడకన యాత్ర నిర్వహించారు. యాత్ర బాలికల ఉన్నత పాఠశాల నుంచి హైస్కూలు రోడ్డు, గడియారం సంభం సెంటరు వరకూ సాగింది. బీజేపీ మహిళా మోర్చా నారీ శక్తి ఏపీ స్టేట్ కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్వీ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పార్టీ నాయకుడు అరిగెల తేజా వెంకటేష్‌తోపాటు మహిళా మోర్చా నేతలు పాల్గొన్నారు.



యానాంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

యానాంలో ర్యాలీ

యానాం: యువతీ,యువకుల్లో దేశభక్తి భావనతో పాటు జాతీయజెండా యొక్క ప్రాధాన్యతను తెలిపేలా పుదుచ్చేరి ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా భారీ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ స్కూల్స్, కళాశాలలు విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, సేవాదళ వలంటీర్లు, ఆపదమిత్ర బృందాలు, వివిధ గ్రామాల మహిళా సంఘ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య, ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన సిబ్బంది హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీని ఆర్ఏఓ మునిస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, విద్యాశాఖాధికారి లక్ష్మణ్‌ప్రవీణ్, జీజీహెచ్ డీడీ రవిశంకర్ పాల్గొన్నారు.

అసెంబ్లీ దృష్టికి యానాం ప్రజల సమస్యలు

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే అశోక్



పుదుచ్చేరి అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: రాజధాని 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న యానాం నియోజకవర్గ ప్రజల సమస్యల ఆవేదన, ఆక్రోశం పుదుచ్చేరి ప్రభుత్వానికి వినబడటం లేదా అని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అసెంబ్లీలో ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల పరంగా నెలకొన్న సమస్యలను, ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో శంకుస్థాపనలు చేసినా పనులు ప్రారంభించకుండా అడ్డుపడుతున్న విధానాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వైద్యం అందని పరిస్థితి ఉందని దాదాపు అన్ని కేసులను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తుండటంతో అంబులెన్స్‌లో వారిని తరలించడమే విధిగా ఉందని తెలిపారు. మార్చురీలో శవాలను భద్రపరచడానికి ఫ్రీజర్ బాక్స్ కోసం యానాం యువత ధర్నా చేస్తే కాని మంజూరుకాలేదని వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకం అమలు కాకపోవడంతో తీవ్రమైన వ్యాధులకు చికిత్స అందడం లేదని తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. వివిధ శాఖల్లో అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు మంజూరు చేయాలని కోరారు.పీడబ్ల్యూడీ ఎస్ఎమ్ఆర్‌లకు ఈ సెప్టెంబర్ నుంచి రూ.18వేలు, పీడబ్ల్యూడీ శాఖ ఎస్ఎమ్ఆర్‌లకు 2022లో ఇచ్చిన హామీ మేరకు జీతాలను రూ.10వేల నుంచి రూ.18వేలకు పెంచాలని ఎమ్మెల్యే అశోక్ కోరగా దానికి సీఎం రంగసామి సానుకూలంగా స్పందించి సెప్టెంబర్ నుంచి పెంచిన జీతాలు అమలవుతాయని తెలిపారు. మిల్క్ బాయిలర్స్‌కు సైతం పెంచిన జీతాలు అమలు చేయాలని ఎమ్మెల్యే అశోక్ డిమాండ్ చేశారు.

పాలిథిన్ సంచులపై పూర్తి నిషేధం విధించాలి

అమలాపురం టౌన్: పర్యావరణానికి పెను ముప్పుగా మారుతున్న పాలిథిన్ సంచులపై పూర్తి నిషేధం విధించాలని అమలాపురానికి చెందిన వర్కర్స్ ఆఫ్ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పాలిథిన్ సంచులు ప్రస్తుతం మురుగు కాలువల్లో, పంట కాలువల్లో పేరుకుపోయి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయిన్లు, కాలువలు వాడి పాడేసిన పాలిథిన్ కవర్లు, సీసాలు, ప్లేట్లు, గ్లాసులతో నిండిపోతున్నాయని పేర్కొన్నారు. వీటి వల్ల పర్యావరణం దెబ్బ తినడమే కాకుండా తాగు నీరు కూడా కలుషితం అవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలు మానవ మనుగడకే ప్రమాదకరమని ఆయన స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్న మూగ జీవాలు తొందరగా మృత్యువాత పడుతున్నాయని గుర్తు చేశారు. ప్లాస్టిక్ సామగ్రిని ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయిలో నిషేధించాలని సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



తాళ్లరేవు సంపద తయారీ కేంద్రంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న అధికారులు



ఉప్పలగుప్తంలో చెత్త నుంచి సంపద తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శులు, సర్పంచులు

తాళ్లరేవు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం చేపట్టిన సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రెండవరోజు కొనసాగింది. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ అంశాలపై శిక్షణకు సంబంధించి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎం.భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శులు జీవీ రమణమ్మ, కె.సుధారాణి తదితరులు చెత్త సేకరణ, చెత్త నిర్వహణ పద్ధతులు, వర్మీ కంపోస్ట్ మార్కెటింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకిళ్ల పూడి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు వెంటపల్లి నూకరాజు, పెయ్యల మంగేష్, చిట్టూరి నాగమణి, కె.సింహాద్రమ్మ ప్రసంగించారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లపై అవగాహన

ఉప్పలగుప్తం: సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణలో భాగంగా మండలంలోని 17 గ్రామాల సర్పంచులకు ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండవ రోజు శిక్షణలో భాగంగా మంగళవారం స్థానిక గ్రామంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో చెత్త నుంచి సంపద తయారు చేసే విధానాన్ని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు పాల్గొన్నారు.

పేరూరులో..

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ‌ పంచాయతీరాజ్ వ్యవస్థపై మూడు రోజుల పాటు కొనసాగే శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పేరూరు గ్రామ‌ పంచాయతీ వద్ద శిక్షణ తరగతులు కొనసాగాయి. గ్రామంలో సంపద కేంద్రంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఎల్‌పీవో బొజ్జిరాజు, ఎంపీడీవో గుబ్బల మల్లికార్జునరావు సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి అరుణ, గుంగుమళ్ల ఏసుబాబు, కార్యదర్శులు ఆర్ఎస్.ఎస్ సురపరాజు, కట్టా సత్తిబాబు, ఆదినారాయణ పాల్గొన్నారు.

కొనసాగిన శిక్షణ

అల్లవరం: పరిసరాల్లో లభించే చెత్తను సేకరించి దాని ద్వారా సంపదను సృష్టించుకుని తద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొమరగిరిపట్నంలో ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రంలో మంగళవారం వారికి శిక్షణ చ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చెత్త సేకరణ, తరలింపు అనంతరం వర్మీ కంపోస్టుగా మార్చుకునే విధానంపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాకావు విజయలక్ష్మీ, సాధనాల వెంకటరావు, కొల్లు వెంకటరమణ, సుందరనీడి సాయి, బొమ్ము బాలవేణి, మల్లాడి మంగాయమ్మ, చిట్నీడి శ్రీదేవి, తోట శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ

అయినవిల్లి: ఎస్.మూలపాలెంలో భాగంగా మంగళవారం చెత్త నుంచి సంపద తీసే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఎంపీడీఓ టి. సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో చెత్త నుంచి సంపదను తయారీ కేంద్రం వద్ద మండలంలోని 21 గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల విస్తరణాధికారి గరిమెళ్ల రవి పాల్గొన్నారు.


ప్రమాద బాధితుడి వైద్యానికి రూ.15 వేల సాయం



బాధితుడి బంధువుకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కపిలేశ్వరం మండలం కేదార్లంక గ్రామానికి చెందిన సాదా సుబ్రహ్మణ్యం (43) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకి తీవ్ర గాయాలతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశ్రీలో ఇప్పటి వరకు వైద్యం చేశారు. లిమిట్ అయిపోవడంతో సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఇటుక బట్టీలో పని చేసే అతడికి అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో బంధువులు విరాళాలు సేకరించి వైద్యం చేయిస్తున్నారు. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో రావులపాలెం లో పేషెంట్ తమ్ముడు జానకి రామయ్యకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ. 15 వేల నగదును సాయంగా అందజేశారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ ఉద్యమం



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మామిడికుదురు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా భారీగా ఉద్యమించాలని మామిడికుదురులో జరిగిన నాలుగు మండలాల మాల మహానాడు నేతల సమావేశం తీర్మానించింది. మాల మహానాడు సీనియర్ నేత నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్ ద్వారా మాలల సత్తా చూపించాలన్నారు. భారత్ బంద్ విజయవంతం చేయడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ కోసం కోర్ కమిటీలను ఏర్పాటు చేశారు. సమావేశంలో మట్టా సత్తిబాబు, తాడి సహదేవ్, చోటే రాజేష్, మట్టా సురేష్, బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్ఎస్ సాయం పెంపుపై హర్షం

కొత్తపేట: దేవదాయ శాఖ పరిధిలోని చిన్న ఆలయాలకు అందించే ఆర్థిక సాయాన్ని రూ.10 వేలకు పెంచడంపై రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి దూనబోయిన నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.50 వేల లోపు వార్షిక ఆదాయం ఉండే ఆలయాల్లో నిత్య పూజలతో పాటు అర్చకుల గౌరవ వేతనం, ధూప దీప నైవేద్యం పథకం (డీడీఎన్ఎస్) ద్వారా ప్రతి నెలా అందించే రూ.5 వేల సాయాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్టు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం అందిచే ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలని అర్చకులను నారాయణ రావు కోరారు.

కేసు పెట్టిన భార్య: భర్త అదృశ్యం

మామిడికుదురు: భార్య కేసు పెట్టిందని భయపడి భర్త ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఈ సంఘటన పాశర్లపూడిలో జరిగింది. నగరం హెడ్ కానిస్టేబుల్ కేఎన్‌డీ ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. పాశర్లపూడికి చెందిన వేగి వెంకటరత్నంకు 2021లో పేరూరుకు చెందిన పావనితో వివాహం జరిగింది. అప్పటి నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పది రోజుల క్రితం పావని ఫిర్యాదుపై నగరం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చినా మళ్లీ గొడవపడ్డారు. పావని పుట్టింటికి వెళ్లిపోయింది. భర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భార్య కేసు పెట్టిందని భయపడిన వెంకటరత్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై అతడి తండ్రి వెంకటేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ మంగళవారం తెలిపారు.

తాగునీటి కుళాయి నుంచి చేప పిల్ల



మామిడికుదురులో తాగునీటి కుళాయి నుంచి వచ్చిన చేప పిల్ల

మామిడికుదురు: మామిడికుదురు గ్రామంలో తాగునీటి కుళాయిల నుంచి తరచు చేప పిల్లలు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కుళాయి వాటర్ పట్టగా ఆ వాటర్‌లో చేప పిల్ల వచ్చిందని స్థానికులు రుద్రా శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల వ్యవధిలో మూడు సార్లు కుళాయిల నుంచి చేప పిల్లలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

తాగునీరు ఇలా కలుషితం అవుతుంటే ఎలా తాగేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి తాగునీటిలో చేప పిల్లలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీని వివరణ కోరగా దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు.